క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

ఎంఈఓ లీలారాణి



ప్రత్తిపాడు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఎంఈఓ జి.లీలారాణి అన్నారు. మండల పరిధిలోని ఈదులపాలెం ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న వాసిమళ్ల మోహన్‌రావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పమిడి వెంకట్రావు ఫంక్షన్ హాలులో మోహనరావుకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంఈఓ మాట్లాడుతూ వృత్తిలో అంకితభావంతో పని చేసిన వ్యక్తి మోహనరావు అని కొనియాడారు. తరగతి గదిలో ఎందరో విద్యార్థులకు దిశానిర్దేశం చేసి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తీసుకొచ్చారన్నారు.

ప్రత్తిపాడు వెలుగు ఏపీఎంగా లాజరు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల వెలుగు ఏపీఎంగా వంకాయలపాటి లాజరు బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం సురేష్‌కుమార్ బదిలీపై దుగ్గిరాల మండలానికి వెళ్లగా, ఆయన స్థానంలో బాపట్ల జిల్లా పర్చూరు మండలంలో ఏపీఎంగా చేస్తున్న లాజరును ప్రత్తిపాడుకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన ఇక్కడ స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, అంజలితో పాటు సీసీలు, వీవోఏలు ఏపీఎంను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం లాజరు విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు కార్యాలయం చుట్టూ తిరిగే పనిలేకుండా అత్యుత్తమ సేవలు అందిస్తామని చెప్పారు.

పొన్నూరు తహసీల్దార్‌గా జియా ఉల్ హక్



పొన్నూరు: మండల తహసీల్దార్‌గా మహమ్మద్ జియా ఉల్ హక్ నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటి వరకు పల్నాడు జిల్లా మాచర్ల మండల తహసీల్దార్‌గా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా పొన్నూరు వచ్చారు.

ఆహారంలో ఆకుకూరలు తప్పనిసరి



ప్రత్తిపాడు: గర్భిణులు, బాలింతలు ఆహారంలో ఆకుకూరలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని స్థానిక వడ్డెరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల సంరక్షణపై గర్భిణులకు వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న మునగాకు, కరివేపాకు పొడులను తయారు చేసి చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచి ప్రసవించి, బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు అత్యధిక పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. తొలుత పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి.నాగరాజకుమారి, జ్యోతిరాణి, మహాలక్ష్మి, కరీమూన్, వెంకాయమ్మ, నాసరమ్మ, కమలజ్యోతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులు వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి చర్యలు



గుంటూరు రూరల్: నగరపాలకసంస్థ పరిధిలోని చెరువులు, వాకింగ్‌ట్రాక్‌ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కమిషనర్ సమ్మర్‌పేట చెరువు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని చెరువు కట్టలను ప్రజలకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్‌లుగా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో ఫెన్సింగ్ పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామని చెప్పారు. కార్పొరేటర్ బి.స్మితపద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, డీఈఈ హనీఫ్, ఎస్ఎస్ సోమశేఖర్, డేవిడ్ పాల్గొన్నారు.

పాలిథిన్ వ్యర్థాలతో అనర్థం

- పెరిగిపోతున్న వినియోగం
- కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- పారిశుద్ధ్యంపై తీవ్ర ప్రభావం



పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో పేరుకున్న ప్లాస్టిక్ కవర్లు

పొన్నూరు: పాలిథిన్‌పై నిషేధం అమలులో ఉన్నా.. పారిశుద్ధ్య నిర్వహణకు రూ.లక్షల్లో ప్రజాధనం వెచ్చిస్తున్నా... వ్యర్థాల విడుదల శాతాన్ని అధికారులు నియంత్రించలేకపోతున్నారు. ముఖ్యంగా పాలిథిన్ సంచులు, ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని కట్టడి చేయడం లేదు. ఫలితంగా వానొస్తే ముంపు.. మురుగుతో కంపు అన్నట్లుంది పట్టణ ప్రజల పరిస్థితి.

తూతూమంత్రంగా చర్యలు

వివిధ ప్రాంతాలకు వాణిజ్య కేంద్రంగా ఉన్న పొన్నూరులో ప్లాస్టిక్ వినియోగం జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు తనిఖీలు అపరాధ రుసుం విధింపుతో చేతులు దులుపుకుంటున్నారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, ఇంటింటి నుంచి రోజుకు 35 మెట్రిక్ టన్నుల చెత్త విడుదలవుతుండగా, అందులో వాడిపడేసిన పాలిథిన్ సంచులు తదితరాలే ఉంటున్నాయి. ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో చెత్త రూపంలో కాలువల్లో చేరుతోంది. దీంతో ప్రధాన కాలువల్లో మురుగు ముందుకు కదలక పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. రాత్రి వేళల్లో దుకాణదారులు ప్లాస్టిక్ సంచులు, గ్లాసులను ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. మున్సిపల్ శాఖ విధించిన విక్రయ, వినియోగ నిషేధం అమలు తీరును ప్రశ్నిస్తోంది. రూ.లక్షల వ్యయంతో తడి, పొడి చెత్త రీ– సైక్లింగ్ చేసే యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చినా.. ఫలితం ఉండడం లేదు. గతంలో ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలు జరిగిన సమయంలో ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టారు. వస్త్ర నార సంచులు వినియోగించారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పల్లో ప్లాస్టిక్ గ్లాసులు, సంచులే ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.



ప్లాస్టిక్‌తో నిండిన శాంతి నగర్ ప్రధాన కాలువ

మున్సిపాలిటీ వార్డులు..	31
జనాభా	70 వేలు
కుటుంబాలు	15 వేలు
పారిశుద్ధ్య కార్మికులు..	150
ప్రతిరోజు సేకరిస్తున్న చెత్త	35 మెట్రిక్ టన్నులు

విక్రయాలపై నిఘా ఏది..?

పొన్నూరులో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎస్బీబీ రోడ్డు, ముబారక్ నగర్, ఐలాండ్ సెంటర్, కసుకర్రు రోడ్డు, తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాలున్నాయి. రోజుకు సుమారు రూ. 5 లక్షలపైనే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్ముతుంటారు. గత రెండేళ్లుగా పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలు రెండు రెట్లు పెరిగినట్లు చెబుతున్నారు.

ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే చర్యలు



వ్యాపారులు ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. విక్రయాలు పెరగడం వలన కాలువల్లోకి చేరుతోంది. వర్షాలు కురిస్తే ముంపు సమస్య ఏర్పడుతోంది. నాలుగేళ్ల నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. ఇకనైనా ప్లాస్టిక్ విక్రయాలకు స్వస్తిపలకాలి.

–ఇత్తడి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొన్నూరు

జాతీయ స్థాయిలో కిట్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ శేఖర్

ప్రత్తిపాడు: జాతీయ స్థాయి బూట్ క్యాంప్‌లో కిట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఏఐసీటీఈ – మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 23 నుంచి 27 వరకు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో జాతీయ స్థాయి ఇన్నోవేషన్, ఎడ్యుకేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(ఐడీఈ) బూట్ క్యాంపు నిర్వహించారు. క్యాంప్‌నకు దేశంలోని పది రాష్ట్రాల నుంచి 79 బృందాలను ఎంపిక చేశారు. వాటిలో కిట్స్ కళాశాలకు చెందిన తొమ్మిది జట్లు ఎంపికయ్యాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాల సీఎస్ఈ జట్టు బూట్ క్యాంప్‌లో తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు సోమవారం స్థానిక కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కళాశాలలోని సాంకేతిక సదుపాయాల్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. సమాజానికి దేశానికి ఉపయోగపడే టెక్నాలజీ ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. భారత దేశ ఎదుగుదలకు తోడ్పడాలని కోరారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, సీఎస్ఈ విభాగాధిపతి రమేష్ పాల్గొన్నారు.

గ్రోమోర్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో కిరణ్మయి

కాకుమాను: గ్రోమోర్ సెంటర్‌లో అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండల కేంద్రం కాకుమానులో సోమవారం కోరమండల్ మన గ్రోమోర్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులను ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ సంబంధిత పరికరాలను సకాలంలో అందించాలనే లక్ష్యంతో గ్రామంలో మన గ్రోమోర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులను ఉపయోగించాలని ఆమె సూచించారు. జోనల్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ మన గ్రోమోర్ సెంటర్‌లో అన్ని ఉత్పత్తులు లభించడమే కాకుండా శాస్త్రీయ సలహాలు, శాస్త్రవేత్తల క్షేత్ర ప్రదర్శన, మట్టి నమూనా పరీక్షలు చేయడంతో పాటు రైతులు సాగులో అధిక దిగుబడులు సాధించే విధంగా ప్రతి రోజు సలహాలు, సూచనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ భాను ప్రకాష్, మణికంఠ, చెన్నా చారి, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీ చెప్పిన పనులు చేయాలి

అధికారులకు సూచించిన ఎమ్మెల్యే బూర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను: టీడీపీ నాయకులు చెప్పిన పనులను అధికారులు తప్పని సరిగా చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అధికారులకు సూచించారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాలలో టీడీపీకి చెందిన ఐదుగురిని కమిటీ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల కమిటీ సభ్యులు ఏ సమస్యపై వచ్చిన ఆయా సమస్యలను సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను గ్రామ పార్టీ నాయకులు మండల స్థాయి నాయకుల దృష్టికి తీసుకువెళ్లి పార్టీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని వివరించారు. గ్రామ స్థాయి అధికారి నుంచి మండల స్థాయి అధికారి వరకు పార్టీ నాయకులు తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను సూచించారు.

చిరుద్యోగులపై చిన్నచూపు..

గ్రామాలలో పని చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆశ కార్యకర్తలు పార్టీ నాయకులు చెప్పిన ప్రతి పని చేయాలని అలా కాకుండా మీ ఇష్టం వచ్చినట్లు చేస్తే ఉద్యోగంలో నుంచి తీసి మా పార్టీ కార్యకర్తలను నియమించుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ఒళ్లు దగ్గర పెట్టుకుని పార్టీ నాయకులు చెప్పిన ప్రతి పని చేయాలని లేకుంటే మాకు అనుకూలంగా ఉంటే అధికారులను నియమించుకోవాల్సి వస్తుందని ముక్తాయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ యుగకీర్తి పాల్గొన్నారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా అశోక్ కుమార్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా వై.అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖను సెబ్‌గా మార్చింది. దీంతో అప్పటి వరకు సీఐ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ప్రత్తిపాడు స్టేషనులో ఇద్దరు ఎస్ఐలను నియమించి, వారిలో సీనియర్‌కు ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసి పాత ఎక్సైజ్ శాఖగా మార్చడంతో మళ్లీ ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషనుకు ఉన్నతాధికారులు సీఐ పోస్టును కేటాయించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన బదిలీల్లో అశోక్‌కుమార్‌ను ప్రత్తిపాడు స్టేషనుకు సీఐగా నియమించడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా చేస్తున్న మాధవి బదిలీ అవ్వడంతో, ఆమె స్థానంలో ఎస్ఐగా రవీంద్రను నియమించారు. ఆయన కూడా ప్రత్తిపాడులో విధుల్లో చేరారు.

విజ్ఞాన్ వర్సిటీలో ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ట్రీ బేస్డ్ ఎంటర్‌ప్రైజ్ ఇంకుబేషన్ సెంటర్‌ను (టీబీఈఐసీ) సోమవారం ప్రారంభించారు. యూఎస్ఏఐడీ జనరల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ డైరెక్టర్ టిగెన్‌ఫెల్‌డెట్ మార్క్ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వృద్ధిని పెంచడంతో పాటు జనాభా ప్రయోజనాలను ప్రభావితం చేయడానికి, గ్రామీణ యువతతో పాటు వ్యాపారవేత్తలలో స్కిల్స్‌ను అభివృద్ధి చేసి లక్ష్యాలను సులభతరంగా అందుకునేలా చేయడమే ఇంకుబేషన్ సెంటర్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. దేశంలోని ఏడు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, అసోం, హరియాణా, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్) జీవనోపాధి, పర్యావరణ వ్యవస్థ ప్రయోజనాల కోసం అడవులను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ అడవులను విపరీతంగా నరికివేయడం వల్ల ఉష్ణోగ్రతలతో పాటు గ్లోబల్ వార్మింగ్ పెరిగే అవకాశం ఉందన్నారు. తత్ఫలితంగా వచ్చే పరిణామాలను తట్టుకోలేమని చెప్పారు. విద్యార్థులంతా కూడా ఖాళీ ప్రదేశాలలో మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ టీమ్ లీడ్ సౌమిత్రి దాస్, డాక్టర్ రవి ప్రభ, మనోజ్ దబాస్, అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.

లంచాలు తిని కూడా పనులు చెయ్యరా ?

వెలుగు సీసీ సుబ్బారావుపై మండిపడ్డ డ్వాక్రా గ్రూపు లీడరు దానమ్మ



సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రూపు లీడర్ దానమ్మ

ప్రత్తిపాడు: '' మా పని చేస్తామన్నారు.. చిన్నపాటి సంతకం కోసం రూ. రెండు వేలు లంచం తీసుకున్నారు.. లంచం తిని కూడా సంకతం చేయకుండా మూడు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారా? మా డబ్బులు మేం తీసుకోవడానికి కూడా ఇన్ని అగచాట్లా '' అంటూ ఓ డ్వాక్రా గ్రూపు లీడరు మూకిరి దానమ్మ వెలుగు సీసీపై మండిపడింది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలేనికి చెందిన ప్రియాంక మహిళా గ్రూపులో ఎం. విజయకుమారికి స్త్రీనిధి కింద రూ.లక్ష రూపాయల రుణం మంజూరయ్యింది. రుణాన్ని గ్రూపు ఖాతాలోకి స్త్రీనిధి అధికారులు జమ చేశారు. గ్రూపు ఖాతా నుంచి వ్యక్తిగత ఖాతాకు నగదు బదిలీ చేసేందుకు సంబంధిత వీవో సీసీ సుబ్బారావును గ్రూపు లీడరు దానమ్మ సంప్రదించారు. అదిగో ఇదిగో అంటూ నెలల తరబడి ఆమెను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. అయినప్పటికీ పని చేయకపోవడంతో సీసీకి లంచంగా రూ. 2 వేలు, వీవోఏకు రూ. 2 వేలు ఇచ్చింది. అయినా వారు సంతకాలు చేయకుండా తిప్పుకుంటూ రోజుకోరకం వంకలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సహనం కోల్పోయిన గ్రూపు లీడరు దానమ్మ సోమవారం వెలుగు కార్యాలయానికి వచ్చింది. సీసీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పని చేసేందుకు రెండేసి వేలు డబ్బులు తీసుకుని కూడా చెయ్యరా.. అంటూ సూటిగా ప్రశ్నించింది. స్త్రీనిధి రుణం మంజూరు కావాలంటే బ్యాంకు లింకేజీ రుణం క్లోజ్ చేయాలని చెప్పడంతో అప్పులు తెచ్చి డబ్బులు కట్టానని, ఇప్పుడు స్త్రీనిధి రుణం తీసుకుందామంటే సంతకాలు చేయడంలేదని వాపోయింది. అధికారుల తీరుతో అటు బయట తెచ్చిన అప్పులకు, ఇటు స్త్రీ నిధి రుణాలకు రెండింటికీ వడ్డీలు కట్టుకోలేని చికితిపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన సీసీ బ్యాంకులో ఓడీ ఉన్నట్లు చూపిస్తుందని అందుకే ఇబ్బంది అవుతుందని, మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ఆమె అక్కడి నుంచి వెనుదిరిగింది.

సేంద్రియ వ్యవసాయంతో రైతుకు మేలు

ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి

గుంటూరు రూరల్: గ్రామాల్లో ఉన్న రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా నడిపించటం ఆరోగ్యకరమైన పంటలను పండించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు రైతులకు అదనపు ఆదాయం దిశగా కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తెలిపారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో నాలుగు రోజులుగా సెమిస్టర్ 1, సెమిస్టర్ 3, రైతులు, శాస్త్రవేత్తలకు, మెంటార్స్‌కు ఐజీజీఏఏఆర్ఎస్ అకాడమి ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ముగింపు కార్యక్రమంలో సోమవారం ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ ఐదు జిల్లాలకు చెందిన గుంటూరు జిల్లా, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్‌జిల్లాలకు చెందిన శాస్త్రవేత్తలకు మెంటర్స్‌కి ట్రైనింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. ట్రైనింగ్ ప్రధాన ఉద్దేశం రైతు స్థాయి నుంచి రైతు శాస్త్రవేత్త స్థాయి వరకు రైతులు ఎదగాలని, పూర్తిస్థాయిలో అగ్రికల్చర్ బీఎస్సీ కోర్సు చేసి వారి సొంత పొలంలో ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్ డెవలప్ చేస్తూ తన పొలం లో రసాయన ఎరువులకు బదులుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నటువంటి వ్యవసాయ భూములకు తేడా చూపించాలన్నారు. తేడాను చూపిస్తూ పెట్టుబడి తగ్గించి ప్రధాన పంటతో పాటు అంతర పంటలు విధానంతో అధిక ఆదాయాన్ని పొందే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. తన పొలం చుట్టూ ఉన్న రైతులను తన గ్రామంలో ఉన్నటువంటి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ తిమాటిక్ లీడ్ సుధాకర్, ధర్మేంద్ర, కిరణ్మయి, డిపిపిలు భాష , భవాని రాజ్, శృతి పాల్గొన్నారు.

ఈ బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

- నూతన ఆవిష్కరణకు ఓవర్ ఆల్ విన్నర్ అవార్డు
- ఏటిఎస్, ఏఎఫ్‌టి, విండ్ పవర్ సిస్టంల రూపకల్పన



అవార్డు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్ జాతీయ స్థాయిలో అవార్డులను సాధించడం ఆనందంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మెకట్రోన్ మోటార్ ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లోని శ్రీరామకృష్ణ ఇనిస్టూట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సెప్టెంబర్ 24 నుంచి 27వ తేదీలలో ఎలక్ట్రిక్ బైక్ డిజైన్ చాలెంజ్ సీజన్ 4.0 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఈ బైక్ వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో, బెస్ట్ యాసెలరేషన్ అవార్డు, బెస్ట్ హిల్ క్లింబింగ్ అవార్డు, ఆటోక్రోస్ టెస్ట్ రన్నర్ అవార్డులతో ఓవర్ ఆల్ విన్నర్ అవార్డు సాధించి జాతీయ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. కళాశాల సెక్రటరీకరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పోటీల్లో అవార్డులతో పాటుగా రూ 60 వేల రూపాయల నగదు బహుమతి సాధించడం సంతోషకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ కళాశాల అధ్యాపక నిపుణుల నేతృత్వంలో ఈబైక్ వాహన తయారీలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం నుండి 21 మంది, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి నలుగురు, ఐటీ విభాగం నుంచి ఒక విద్యార్థి మొత్తం 26 మంది విద్యార్థులతో కూడిన జట్టు హాజరైనట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ డీవీ కృష్ణప్రసాద్, డాక్టర్ ఎస్.నాగ మల్లేశ్వరరావు, పి.వెంకటమహేష్, ఆర్.మారుతీ వరప్రసాద్ పాల్గొన్నారు.

వీవీఐటీలో విద్యార్థుల రక్తదానం



నంబూరు వీవీఐటీలో రక్తదానం చేసిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న యామినిశర్మ

పెదకాకాని: అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పదని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆదేశానుసారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని యామిని శర్మ ప్రారంభించారు. 160 మంది విద్యార్థులు గుంటూరు రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్‌కు బ్లడ్ యూనిట్లను అందించారు. ఈ సందర్భంగా సాదినేని యామిని శర్మ మాట్లాడుతూ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ అగ్రగామిగా ఎదుగుతుందనీ, సాంకేతికంగా ఎదుగుటకు అన్ని అవకాశాలను మోదీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఐఎల్‌జే భక్తసింగ్ పాల్గొన్నారు.

వీవీఐటీలో హీరో కార్తి సందడి



విద్యార్థులతో కలసి స్టెప్పులేస్తున్న హీరో కార్తి

పెదకాకాని: కార్తి, అరవిందస్వామి ప్రధాన పాత్రల్లో సూర్య, జ్యోతికా దంపతులు స్వయంగా నిర్మించిన చిత్రం 'సత్యం సుందరం' ఇటీవల విడుదలైంది. విజయోత్సవ యాత్రలో భాగంగా చిత్ర హీరో కార్తి, చిత్ర బృందం వీవీఐటీ కళాశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లడుతూ 'సత్యం సుందరం' కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమని తెలిపారు. స్నేహం గురించి చెబుతూ మంచిని పెంచే విధంగా ఉంటుందని చెప్పారు. స్నేహితులు మంచిగా ఉంటే అద్భుతంగా ఉంటుందని ఈ చిత్రం తెలుపుతుందని వివరించారు.

చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కార్తి ధన్యవాదాలు తెలిపారు. వీవీఐటీ విద్యార్థి శరత్ తాను రూపొందించిన కార్తి పెన్సిల్ ఆర్ట్‌ను బహుమతిగా అందించాడు. అనంతరం చిత్రబృందం సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రేమ్ కుమార్, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు ఇలా.. నడక ఎలా..



నారాకోడూరు సెంటర్- నుంచి గుండవరం వెళ్లే ప్రధాన రహదారి మీదకు చేరిన మురుగునీరు

చేబ్రోలు: అధికారుల నిర్లక్ష్యం వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు సెంటర్ నుంచి గుండవరం వెళ్లే ప్రధాన రహదారిపై గత కొద్ది రోజులుగా మురుగునీరు నిలిచిపోవటంతో రాకపోకలు సాగించేవారు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు సమస్యను తీసుకువెళ్లినప్పటికి పరిష్కరించటంలో జాప్యం చేయటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన డ్రెయినేజి వ్యవస్థ లేకపోవటంతో సమీపంలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు ప్రధాన రహదారిపై చేరి పల్లపు ప్రాంతంలో నిల్వ చేరింది. ఈ ప్రధాన రహదారి గుండా గుండవరం, గొడవర్రు గ్రామాలకు చెందిన వాహనదారులు, ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. రహదారికి ఇరువైపుల తాత్కాలిక సైడ్ డ్రెయిన్‌లు తవ్వినా వర్షంనీరు, మురుగునీరు రోడ్లమీద నుంచి వెళ్లిపోయే అవకాశం ఉన్నప్పటికి సమస్యను పరిష్కరించక కాలయాపన చేస్తుండటంపై ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com